◆ఈ వారం కథ


# లో(ల)కం

- ఆకెళ్ళ శివప్రసాద్

బస్సు కదిలింది.

విజయవాడ వదిలి కేవలం నాలుగు ఏళ్ళే అయినా, ఎన్నో యుగాలు గడిచినట్టుగా వుంది.

చలం ఎలా వున్నాడో?



ఉత్తరాలు విష్టారంగా రాస్తున్నాడు అటువైపు రావడం లేదని. అనుకోకుండా ఆఫీసు పని మీద ఇవాళ విజయవాడ బయలుదేరాను.

అశోక్ సంసార జీవితం ఎలా సాగిపోతోందో?

అంతకుముందు ఏ మాత్రం పరిచయం లేక పోయినా -

రెండేళ్ళ కాలంలో ఎంతో దగ్గరై పోయాము.

విజం ...

అశోక్ 'వేరు'గా వెళ్ళిపోయేంత వరకు ఎంతో ఆత్మీయంగా కలిసి వున్నాము.

బస్సు వేగంగా సాగిపోతోంది... అంతకన్నా వేగంగా నా మనసు గతంలోకి సాగిపోయింది.

xx xx xx

ఆఫీసు నుండి డైరెక్ట్‌గా బ్రోకర్ దగ్గరకి బయలుదేరాను. లాడ్జిలో రోజుకి డెబ్బై రూపాయలు 'ఛార్జ్' చేస్తున్నారు. నాలుగు రోజులనాడు ఆఫీసుకి దగ్గర్లో వున్న బ్రోకర్ అద్దె యిల్లు చూపెడ్తానని యాభై రూపాయలు తీసుకున్నాడు, యాభై తీసుకున్న వెంటనే, రెండు యిళ్ళు చూపెట్టినా అద్దె మరీ ఎక్కువనిపించింది. బ్యాచిలర్‌కి రూమ్ కావాలంటే టైమ్ పద్తుందంటున్నాడు.

ఆ రోజు - నేను వెళ్ళేసరికి - నన్ను చూసి -

"... రండి సార్ ... రండి ... మీ గురించే ఎదురు చూస్తున్నాను..." అన్నాడు బ్రోకర్. అక్కడే వున్న కుర్చీలో కూర్చున్నాను.

"... వీరి పేరు చలం ... మీలాగే రూమ్ కోసం వెతుకుతున్నారు..." అని పరిచయం చేశాడు. అంతకుముందే పక్క కుర్చీలో కూర్చున్న తన్ని. ఇద్దరం షేక్ హ్యాండ్ ఇచ్చుకున్నాము.

"... మీకభ్యంతరం లేకపోతే గాంధీనగరంలో ఓ పోర్షన్ వుంది ... అద్దె తొమ్మిది వందలు చెప్తున్నారు ... ఇద్దరూ కలిసి తీసుకుంటే బాగుంటుంది ...." అన్నాడు బ్రోకర్. నన్ను చలానికి పరిచయం చేయడంలోని ఆంతర్యం అర్థమయింది నాకు.

"... నాకే మాత్రం అభ్యంతరం లేదు ..." అన్నాడు చలం. నేనూ అంగీకరిస్తున్నట్టుగా చెప్పాను. ముగ్గురం కలసి, గాంధీనగరం వెళ్ళాము. పోర్షన్ ఇద్దరికీ నచ్చింది. అద్దె ఎక్కువగా అనిపించినా అన్నీ సెపరేట్. మర్నాడే ఇంట్లోకి వస్తామని చెప్పి, ఎడ్వాన్స్ యిచ్చి కదిలాము.

చలం ఆంధ్రాబ్యాంక్‌లో పనిచేస్తున్నట్టు, అతనికి ట్రాన్స్‌ఫర్ అయి, నాలాగే ఉద్యోగ రీత్యా విజయవాడ వచ్చాట్ట. ప్రస్తుతం బంధువుల ఇంట్లో వుంటున్నాట్ట. దారిలో తన వివరాలు చెప్పి, నా వివరాలు అడిగాడు. నేనూ తనలాగే ఉద్యోగ రీత్యానే ఈ వూరు వచ్చినట్టు చెప్పాను.

మర్నాడే ఇద్దరం ఆ యింట్లోకి మారిపోయాము. ఇద్దరికీ వంట చేయడం రాకపోవడం చేత దగ్గర్లో వున్న 'మెస్'లో భోం చేస్తున్నాము. నెల రోజుల్లో ఉదయం ఆఫీసుకి వెళ్ళేవరకు, ఆఫీసు నుండి వచ్చాక నిద్రపోయే వరకు చెప్పకున్న కబుర్లలో ఒకరి విషయాలు మరొకరికి తెలిశాయి. చలం వాళ్ళది మాలాగే మధ్య తరగతి కుటుంబం. జీతంతో జీవన రథాన్ని లాగాలి.

"... చూడు ప్రసాద్ ... నీకు మధ్య తరగతి జీవితాల గురించి తెలియంది కాదు ... డబ్బున్న వాళ్ళకీ, ఏమీ లేని వాళ్ళకీ మధ్యమున్న ప్రపంచం ఇది. ఇక్కడ బాధలు, కన్నీళ్ళు ఎలా వుంటాయో ఆనందాలు, ఆప్యాయతలు అలాగే వుంటాయి ... మహా నాటకాలని మించిన నాటకం మధ్య తరగతి జీవితం ... కాని ... నాకు ఎందుకో మొదటి నుండి 'నటన' అంటే నచ్చదు ... మనలో లేని లక్షణాలు వున్నట్టు రంగులు వేసుకోవడమంటే అసహ్యం ... యింట్లో ఎన్నోసార్లు ఈ విషయంలో గొడవలు జరిగాయి... 'ఫాల్స్ ప్రిస్టేజీ' ముసుగు వేసుకుంటాము ... అప్పలు చేస్తాం ... జనం గురించి వేషాలు కడ్తాం ... అవన్నీ నాకు యిష్టం వుండదు ... నిజం నిష్కర్షగా నిజాయితిగా అంగీకరిస్తాను... హిపోక్రసీ అంటే ద్వేషము... వున్నది వున్నట్టుగా చెప్తేకానీ ... నాకు నిద్రపట్టదు ..." అన్నాడోసారి.

ఆ రోజు –

ఆఫీసు నుండి నేను వచ్చేశాను. 'మెస్'కి వెళ్ళి భోజనం చేసి వచ్చాను. చలం యింకా రాలేదు. మధ్యాహ్నం ఫోన్ చేశాడు ఎవరో ఫ్రెండ్ వచ్చాడని, ఆలస్యంగా వస్తానని.

రాత్రి పదకొండు ధాటాకా – యింటికి చేరుకున్నాడు.

తలుపు తీసిన నాకు "గుప్పన" వాసన వచ్చింది.

"... సారీ బాస్ ... బాగా లేటయ్యింది ... ఫ్రండ్‌ని చాలా రోజులకి కలిసానని ..." అస్పష్టంగా వినిపించాయి మాటలు. ఏదో మాట్లాడుతూనే నిద్రలోకి జారుకున్నాడు.

మర్నాడు –

ఉదయాన్నే, రోజూ 'పేపర్' చూడడానికి వచ్చే యింటి ఓనర్ –

"... ఏమిటయ్యా నిన్న రాత్రి బాగా లేటయ్యిందే? ..." అని ప్రశ్నించాడు.

".. అవునండి ... ఫ్రండ్ వస్తే 'పార్టీ' చేసుకున్నాము..." అన్నాడు చలం.

"... పార్టీయా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"... అవునండి... డ్రింక్ పార్టీ ..." చాలా మామూలుగా చెప్పాడు చలం.

"... డ్రింకా?..." అని తాగుడువల్ల కలిగే నష్టాలు గురించి చెప్పకుపోయాడాయన. క్షణాల్లో యిల్లు ఖాళీ చేయమంటాడేమోనని భయపడ్డాను. ఆ మాటే ఆయన వెళ్ళిపోయాక చలంతో అంటే –

"... ఎలా ఖాళీ చేయమంటాడు గురూ?... ఆరు వందలు కూడా 'అద్దె' రాని పోర్షన్‌ని తొమ్మిది వందల కిచ్చినప్పడే ఆయన నైతికంగా అమ్ముడుపోయాడు ..." కుండబద్దలు కొట్టినట్టుగా అన్నాడు.

ఆ రోజు .

ఆఫీసు నుండి వచ్చేసరికి చలం మరో వ్యక్తీ వున్నారు.

అతని పేరు 'ఆశోక్' అని చెప్పి పరిచయం చేసి –

"... మనకి యింకాస్త 'బర్డెన్' తగ్గుతోంది గురూ .... ఇతను మా బ్యాంక్‌కి దగ్గర్లో వున్న కంపెనీలో పని చేస్తున్నాడు ... ఇల్లు కావాలని అడిగితే మా పోర్షన్‌లో 'షేర్' చేసుకోవచ్చని చెప్పాను ..." అన్నాడు చలం. ఎలాగూ పోర్షన్ పెద్దగానే వుంది. మరో నూటయాభై అద్దె వాటా తగ్గుతుంది. నేను ఒప్పకున్నాను. ఆ రాత్రే వచ్చేశాడు ఆశోక్ మా పోర్షన్‌లోకి.

ఆశోక్ వచ్చిన 'శుభ' సమయంలో చలం, ఆశోక్ 'డ్రింక్'తో సెలబ్రేట్ చేసుకున్నారు ఆ రాత్రి!!!

ఆశోక్ వాళ్ళది బాగా వున్న కుటుంబం అంట

"... నిజానికి నాకీ ఉద్యోగం చేయకపోయినా గడుస్తుందండి ... కానీ ... మా వాళ్ళు బలవంతం చేస్తే చేయక తప్పడం లేదు ..." అన్నాడోసారి. ఊళ్ళో అతని పేరు మీద పొలం కూడా వుందిట.

ఆ రోజు చలం ఆఫీసు నుండి వస్తూనే –

"... మనవాడు ప్రేమలో పడ్డట్టున్నాడోయ్ ... సాయంత్రం బస్సులోంచి చూశాను ... లబ్బీపేట దగ్గర ఎవరో అమ్మాయితో తంటాలు పడ్తున్నాడు ..." అన్నాడు.

ఆశోక్ వచ్చేసరికి తొమ్మిదయింది. 'మెస్' కెళ్తున్నప్పడు అడిగాడు చలం –

"ఏం గురూ ... ఎంతవరకు వచ్చింది ప్రేమ కథ...?" అని.

"... ఏం ప్రేమ కథ గురూ? ... చంపుకు తింటోంది ... పెళ్ళి చేసుకోమని ..." అని –

"... ఒకరా యిద్దరా? ... అసలు నిజం చెప్తే నమ్మరు మీరు ... కాలేజీ రోజుల నుండి నా 'క్రేజ్' అంతే ... డిగ్రీ మూడేళ్ళలో కాలేజీలో రోజూ మనని పలకరించని అమ్మాయి లేదనుకో... ఆఖరికి మా ఇంగ్లీషు మేడమ్ కూడా ప్రేమలో పడింది ..." అని ఈజీగా నవ్వేశాడు. ఎందుకో ఆశోక్ మాటలు పూర్తిగా నమ్మాలనిపించలేదు నాకు.

ఆ రాత్రి రాత్రంతా –

ప్రేమ కబుర్లలో గడిపేశాము.

చలం కూడా జీవితంలో రెండుసార్లు "ప్రేమ ఆటలు" ఆడాడు.

xx xx xx

"... ఎలా వుంది అమ్మాయి? ..." వస్తూనే అడిగాడు చలం.

"... ఏవరేజ్ గురూ ..." అన్నాడు సూట్‌కేసులోంచి బట్టలు బైటకి పడేస్తూ. ఆశోక్ పెళ్ళి చూపులకని వెళ్ళాడు.

"... కానీ మా వాళ్ళందర్కీ వచ్చింది సంబంధం ..." అన్నాడు. ఆ రాత్రి ఆ అమ్మాయి పూర్తి వివరాలు చెప్పాడు. ఒక్కర్తే అమ్మాయిట.

### "మునిమాణిక్యం చమత్కారాలు"

మునిమాణిక్యం నరసింహారావుగారు హైదరాబాదులోని గన్ఫౌండ్రిలో వుండేవారు. వారిదగ్గర నేను రోజూ రెండు గంటల పాటు లేఖకునిగా పనిచేసేవాణ్ణి. వారేం మాట్లాడినా, రాసినా, పనిచేసినా హాస్యభరితంగానే వుండేవి.

ఒకరోజు వారు కథను డిక్టేట్ చేస్తూ "ఇవ్వాళ వంకాయ కూర తినాలని వుందోయ్" అన్నారు నాతో. "మరేం అమ్మగారికి చెప్పండి" అన్నాను నేను. వారు వెంటనే "ఒసేవ్ రాజ్యలక్ష్మీ ఇవ్వాళ దోసకాయ కూర చేయవోయ్" అన్నారు. ఆ మాట విన్న వారి శ్రీమతి "దోసకాయ సర్ది చేస్తుందని డాక్టర్ చెప్పాడు కదండి. ఇవ్వాళ వంకాయ కూర చేస్తాను. మరేం మాట్లాడకండి" అంటూ విసురుగా వంటింట్లోకి నడిచారు. అప్పడు మునిమాణిక్యంగారు నాకేసి చూస్తూ చిరునవ్వు నవ్వారు. తమకు కావలసిన పనిని సాధించటానికి ఎదుటివారి మనస్తత్వాన్ని బట్టి చాకచక్యంగా వ్యవహరించడం–మునిమాణిక్యం లాంటివారికే సాధ్యమవుతుందని నాకా క్షణంలో అర్థమైంది.

–డా. మసన చెన్నప్ప

## మునిమాణిక్యం చమత్కారం

మునిమాణిక్యంగారు చరిత్రోపాధ్యాయులుగా చాలా కాలం పనిచేశారు. వారు పనిచేస్తున్న స్కూల్ కమిటీ మెంబరుకు మునిమాణిక్యంగారంటే పడదు. ఒకరోజు మునిమాణిక్యంగారు క్లాసులో వుండగా అనుమతి లేకుండానే ప్రవేశించి యథాలాపంగా గ్లోబుమీద చెయ్యి వేశాడు. అది గిర్రున తిరుగుతుండగా ఆయన "ఇది కూడా సీలలు ఊడగొట్టి పాడుచేశారు. మీరెలాంటి వారో నాకు తెలుసు" అని కోపించారు. మునిమాణిక్యంగారు మాత్రం అమాయకంగా ముఖం పెట్టి "అయ్యో, పొరపాటు జరిగిపోయింది. దీన్ని మాత్రం హెడ్మాస్టర్ దృష్టికి తీసుకొనివెళ్లకండి" అని ప్రాధేయపడ్డారు. అంతకుముందు ఆ విషయాన్ని హెడ్మాస్టర్ దృష్టికి తీసుకొని వెళ్లాలన్న దృష్టిలేని కమిటీ మెంబరు మునిమాణిక్యంగారి మాటల్లోని వ్యంగ్యాన్ని గుర్తించక వెంటనే గ్లోబును తీసుకొని హెడ్మాస్టర్‌గారి గదిలోకి వెళ్లాడు. ఆ తరువాత హెడ్మాస్టర్‌గారి వివరణతో ముఖం కందగడ్డ చేసుకొని తలవంచుకొని వెళ్ళిపోయాడు. అది మొదలు ఆయన మునిమాణిక్యంగారి జోలికి ఎవ్వరూ రాలేదు.

—మనవ చెన్నప్ప

కట్నం కూడా బాగా యిస్తామన్నార్ట. లాంఛనాలు ఘనంగా వుంటాయన్నార్ట. అశోక్ మాటలు వింటే అతనికా సంబంధం యిష్టంగానే వున్నట్టు అన్పించింది.

xx xx xx

ఆ రోజు రూమ్‌లోకి వస్తూనే, పెద్ద గొడవ జరుగుతోంది. అశోక్ పెద్దగా చలమ్మీద అరుస్తున్నాడు.

"..నీకు నా పర్సనల్ విషయాల్లో కలగజేసుకునే అవసరం లేదు .... నీ యిష్టం వచ్చినట్టుగా మాట్లాడితే మర్యాద దక్కదు ..."

"... నేనేమీ తప్ప చేయలేదు ..." చలం గొంతు.

"... వేరే వాళ్ళ గురించి నీ యిష్టం వచ్చినట్టు చెప్పడం తప్పే..."

"... యిష్టం వచ్చినట్టు చెప్పలేదు ... నిజమే చెప్పాను ..." నేను వచ్చిన 'ధ్యాస' కూడా లేనట్టుగా అరుచుకుంటున్నారు. అశోక్ గట్టిగా అరిచి, కోపంగా బైటకి వెళ్ళిపోయాడు. తుఫాన్ తరువాతి ప్రశాంతత రూమ్‌లో –

"... అసలు ఏమైందిరా ...?" కాసేపటి తరువాత సూటిగా అడిగాను.

"... నిజం చెప్పాలంటే ఏమీ లేదు ... నిజం చెప్పినందుకు కోపం వచ్చింది ..." అన్నాడు చలం. అశోక్‌కి 'పిల్లనిద్దామని' వచ్చిన వాళ్లు అతని గురించి "ఎంక్వైరీ" చేస్తూ చలం దగ్గరకి వచ్చారుట. రూమ్మేటని చలం తనకి తెలుసున్న విషయాలు చెప్పాట్ట. అశోక్‌కి కాస్త 'డ్రింకింగ్' అలవాటు వుందనీ, జీతం సుమారు రెండు వేలు వస్తుందని చెప్పాట్ట అవతల వ్యక్తితో.

చలమ్మాటల కాయన ఆశ్చర్యపోయి –

"... నాతో ఏ దురలవాటు లేదని చెప్పి ... ఆరు వేలు జీతం అని చెప్పాడే ..." అని –

"... కట్నం కూడా ఎక్కువ అడిగారే..." అన్నాట్ట. చలం తనకి తెలుసున్న విషయాలు చెప్పానన్నాట్ట.

"... థ్యాంక్సండీ... ఫైనల్‌గా 'ఫిక్స్' చేసుకునే ముందే అసలు నిజం తెలిసింది..." అని వెళ్ళిపోయాట్ట. చలం చెప్పినట్టు అశోక్కి ఎలా తెలిసిందో, చలానికి కూడా తెలీదుట, తను 'వాళ్ళెవరో అశోక్' గురించి అడిగినట్టు చెబ్దామను


కండ్లకు సాంప్రదాయ సిద్ధమైన సంరక్షణ శింగార్ కాజల్




కాటుకను తయారు చేయడంలో అవలంబించే పురాతన ఆయుర్వేద సాంప్రదాయ పద్ధతులకు పునర్జీవం పోసింది - శింగార్. శింగార్ ప్రత్యేకించి మీ కండ్లకు ఎంతో మంచిది. ఎందుకంటే హాయిని మరియు అలసటనుండి పూర్తి ఉపశమనాన్ని కల్గిస్తుంది. అంతేగాక దీనికిగల మృదువైన నల్లని నీడలు కండ్లకు చక్కని అందాన్ని కల్గించి అవి మిలమిలా చేస్తుంది.




S శింగార్®
భారతీయ నారీమణితో కలిసివుంటుంది. 30 సంవత్సరాలనుండి.

కుంటుండగానే, అశోక్ వచ్చి 'గొడవ' లేవదీశాట్ట.

"... నాకు తెలిసింది నేను చెప్పాను... నిజం చెప్తే తప్పా?..." అని ఎదురు ప్రశ్న వేశాడు. ఇంత కాలం, ముగ్గురి మధ్యా ఏ రకమైన 'సమస్యలు' తలెత్తకుండా కాలం సాగిపోయింది. మొదటి నుండి నేను గమనిస్తూనే వున్నాను. చలం మనస్తత్వానికి వ్యతిరేకమైన మనస్తత్వం అశోక్‌ది. అశోక్ మాటల్లో ఎంత నిజముందో తెలుసుకోవడం కష్టం. అబద్ధానికి అందమైన రంగు పూసి నిజం కన్నా బాగా చెప్పగలడు అన్పించేది ఒక్కొక్కప్పుడు.

ఆ రాత్రే–

మేము పూహించని మరో సంఘటన జరిగింది.

రాత్రి పది గంటలకి అశోక్ తిరిగి వచ్చి, తన సామాన్లు తీసుకుని రూమ్ ఖాళీ చేసి వెళ్ళిపోయాడు, ముక్తసరిగా నాతో చెప్పి.

మేమిద్దరము అతన్ని ఆపే ప్రయత్నం చేయలేదు.

ఎందుకంటే –

నిజం కొందరికి ఇష్టంగా వుంటే మరికొందరికి కష్టంగా వుంటుంది!!!

* * *

ఆ తరువాత –

నాకు ట్రాన్స్‌ఫర్ అయ్యేంతవరకు చలం, నేనూ అదే ఇంట్లో వున్నాం. అశోక్ కన్పించినప్పుడు చలం నాతో వుంటే 'పొడి'గా మాట్లాడేవాడు. చలం లేనప్పుడు, చలాన్ని కసిదీరా తిట్టేవాడు. చలం వల్లే 'మంచి సంబంధం' చెడిపోయిందనేవాడు. మరో నాలుగు నెలల తరువాత అశోక్కి మరో అమ్మాయితో పెళ్ళి అయింది.

చలం కోసం కూడా చాలా మంది పెళ్ళివాళ్ళు వచ్చేవాళ్ళు. కానీ –

నిజాన్ని నిష్కర్షగా చెప్తే ఎందుకో వాళ్ళు హర్షించలేకపోయేవాళ్ళు. వచ్చిన వాళ్ళకి తన గురించి అన్ని విషయాలూ చెప్పి–

"...నాకు 'డ్రింకింగ్' అలవాటు వుందండి..." అని –

"... మళ్ళీ చెప్పలేదు అనుకోకండి... నేనింతవరకు రెండు సార్లు ప్రేమలో పడ్డాను... కాకపోతే రెండు సార్లూ ఘోరంగా ఫెయిలయ్యాను" అనేవాడు నవ్వుతూనే. నేను చాలాసార్లు అన్నాను చలంతో "అయిపోయిన ప్రేమ వ్యవహారాల గురించి చెప్పడమెందుకని?"

"...పెళ్ళంటే ఒక నమ్మకం... మంత్రాలకి, సంప్రదాయాలకి అతీతమైన నమ్మకం... ఈ నమ్మకం ఎప్పటికీ వుండాలంటే ఒకరి విషయాలు ఇంకొకరికి పూర్తిగా తెలియాలి... తరువాత 'కొత్త'గా తెలిస్తే జీవితాంతం బాధే. అందుకే ... నిజాన్ని నిజాయితీగా చెప్పేశాను..." అనేవాడు. మనిషి ఎంత మంచివాడైనా, 'నిజాన్ని' చెప్తే ఏ మాత్రం హర్షించలేడనడానికి సాక్ష్యం చలం!!!

... ... ...

నాకు తెలీకుండానే గతంలోంచి నిద్రాదేవి ఒడిలోకి జారుకున్నాను.

బస్సు సడన్ బ్రేక్‌కి ఉలిక్కిపడి చూసేసరికి – విజయవాడ రోడ్ల మీద బస్సు సాగిపోతోంది.

ఆఫీసు పని చూసుకుని చలాన్ని కలుసుకొనేటప్పటికి సాయంత్రం అయింది. నన్ను చూసి ఉత్తరం రాసి రానందుకు 'కించిత్తు' బాధపడ్డా, ఆనందంగా పలకరించాడు.

"...పెళ్ళి ప్రయత్నం ఎంతవరకు వచ్చింది గురూ...?" అని అడిగాను.

"... నన్ను ధైర్యం చేసి పెళ్ళాడ్డానికి ఎవరూ రావడం లేదు" అని చిత్రంగా నవ్వాడు.

"... నాకు నచ్చినా... వాళ్ళకి నేను నచ్చడం లేదు గురూ..." అన్నాడు నవ్వుతూనే.

దగ్గర్లో వున్న హోటల్లో టిఫిన్ చేస్తున్నప్పుడు అడిగాను–

"...అశోక్ ఎలా వున్నాడు?... ఈ మధ్య ఉత్తరాలు కూడా లేవు..."

"... ఒకటి రెండు సార్లు కన్పించి 'హలో' అన్నాడు అంతే..." ఇంత దూరం వచ్చీ అశోక్‌ని కలవకపోతే బాగోదన్పించి, ట్రాన్స్‌ఫర్ అయ్యాక నాకు రాసిన ఉత్తరంలో ఎడ్రస్ తీసుకుని బయలుదేరాను. చలాన్ని రమ్మంటే–

"... ఎందుకు గురూ... నన్ను పిలిచి వాణ్ణి బాధపెట్టడం?" అన్నాడు నవ్వుతూ.

నేను చలాన్ని బలవంతం చేయలేదు.

సత్యనారాయణపురంలో వుంటున్నాడు. కాస్త కష్టపడి ఇల్లు గుర్తుపట్టగలిగాను.

ఇంటి ముందో మధ్య వయస్కుడు సిగరెట్టు కాలుస్తూ నిల్చున్నాడు.

"...అశోక్ ఎక్కడుంటాడండీ...?" అని అడిగాను అయన్ని. ఆయన నాకేసి తేరిపార చూసి–

"అటు వైపు వాటాలో వుంటున్నాడు..." అన్నాడు. లోపలికెళ్ళాను.

"అశోక్" అని నేమ్ ప్లేట్ వుంది. ఇల్లు 'లాక్' చేసి వుంది. బైటకి వచ్చి సిగరెట్టు కాల్చుకుంటున్నాయన్నే అడిగాను.

"...అశోక్ లేడాండి?..." అని.

"... తాళం వేసి వుందా!" అని ఎదురు ప్రశ్న వేసి, చేతిలో వున్న సిగరెట్టు పారేస్తూ –, నా జవాబుకి ఎదురుచూడకుండా –

"... ఈ మధ్య అతను ఆలస్యంగా వస్తున్నాడు..." అని –

"... ఇంతకీ మీరేమవుతారు ఆయనకి?" అని అడిగాడు.

"... నేనతని ఫ్రెండ్‌ని..." అని చెప్పి –

"...అశోక్ భార్య కూడా బైట కెళ్ళినట్టుంది..." మనసులో అనుకున్నట్టు పైకి అన్నాను. నా మాటలకతను ఉలిక్కిపడ్డట్టయి – "...ఏదో అంటున్నారు?..." అని అడిగాడు. అశోక్ భార్య గురించి అడిగాను.

"... బైట కెళ్ళడమేంటి?... పుట్టింటికి వెళ్ళిపోయింది..." అన్నాడు వెటకారంగా నవ్వుతూ.

"... పుట్టింటికా?..." ఆశ్చర్యంగా అడిగాను.

"... అవునయ్యా బాబు ... ఇతగాడేవో 'మహారాజు' ఉద్యోగం చేస్తున్నానని మాయ కబుర్లు చెప్పి... మోసం చేసి పెళ్ళి చేసుకున్నాట్ట. నిజం తెలిసేసరికి... పాపం... వెర్రిపిల్ల... కంటికి మింటికి ఒకటే రాగాలనుకో... దానికి తోడు ... తాగుడొకటి ... ఇంకేముంది?"

అని ఏదో చెప్పబోతుంటే–

అక్కడ్నించీ కదిలాను.

చలం –

నిజాన్ని నిజంగా చెప్తున్నా లోకం హర్షించలేకపోతోంది.

అశోక్–

ఒకప్పుడు అబద్ధానికి రంగులు వేసి నిజం కన్నా గొప్పగా చెప్పి నమ్మించినా–

నిజం తెలిశాక లోకం భరించలేకపోతోంది...

లోకం పోకడ అర్థం కాలేదు నాకు...

పూర్తి నిజాన్ని భరించలేదు...

అబద్ధాన్ని ఓర్చుకోలేదు ఎక్కువ కాలం...

నిజం, అబద్ధాల మధ్య 'లోలకం'లా వూగే విచిత్ర మనస్తత్వం ఈ లోకానిది!!!!!

## మునిమాణిక్యం చమత్కారాలు

ఒక సాహిత్య సమావేశంలో భమిడిపాటి కామేశ్వరరావుగారు, మునిమాణిక్యం నరసింహారావుగారు వక్తలుగా పాల్గొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన విశ్వనాథ తమ ప్రసంగంలో భమిడిపాటివారిని "మీరు హాస్యబ్రహ్మలు" అని స్తుతిస్తూనే ప్రశ్నార్థకంగా మునిమాణిక్యం వైపు చూశారు. వెంటనే మునిమాణిక్యంగారు "భమిడిపాటివారు హాస్యబ్రహ్మలైతే మేం హాస్య విష్ణువులం" అని చమత్కారంగా మాట్లాడి సభలో నవ్వుల పూలు పూయించారు.

–మసన చెన్నప్ప